# ఎండమావి

- అద్దేపల్లి రాధాకృష్ణ

'నగీనా బొటిక్' ఫ్రంట్‌రూమ్‌లోని ఆఫోటో చూసినప్పుడల్లా నాగలక్ష్మి గతంలోకి వెళ్ళిపోతుంది.

"రవి వర్మకే అందనీ..........

ఒకే ఒక అందానివో......"

"మెహర్ జెస్సియా, కత్రీనాకైఫ్‌ల్లో అందం ఏముంది ? ఎముకల గూడులా, గెడకర్రలా ఉంటారు! అందం అంటే నీది, ఇలా నిండుగా ఉండాలి చీరకడితే ఎలా ఉన్నా అందాలు అలానే కనిపించాలి, తెల్సా.... అదీ అందం అంటే.... చూస్తూ ఉండు, కొన్ని రోజుల్లో ఈ దేశంలోనే నిన్ను టాప్ మోడల్ని చేసేస్తాను... ఏదీ ఆ చెట్టుకి ఆనుకుని, చేతులు మానుమీద ఉంచి చీరకొంగుని బొడ్లో దోపుకుని,..... నడుము మడతలు కొద్ది కొద్దిగా కనిపించేలా నుంచుని ఒకరకంగా నవ్వుతూ నిలబడు..... అదీ,..... వెరీగుడ్.... సూపర్బ్...... ఈ ఫోటోని త్వరలో రేమండ్స్ కంపెనీకి పంపుతున్నాను. అది చూసి వాళ్ళు పిచ్చెక్కిపోయి నీకు ఆఫర్‌ల మీద ఆఫర్‌లు ఇచ్చేస్తారు...... చూస్తూ ఉండు....... అన్నట్లు ఈ సాయంత్రం నీకేమీ పనిలేదుగా, నా రూమ్‌కి రా....... కెరీర్ మేటర్స్ డిస్కస్ చేద్దాం...." సుమన్ మాటలు గుర్తొస్తాయి.

గుడివాడలో ఉండే నాగలక్ష్మికి సినిమాల్లో, సీరియల్లో నటించాలన్న కోరిక విపరీతం. అందుకు పెద్దబాలశిక్ష లాగ పనిచేసే మోడలింగ్ అంటే అందుకే మరీ ఇష్టం. ఆ కోరిక అలా పెరిగి పెరిగి ఇంట్లో చెప్పకుండా హైద్రాబాద్‌కి బస్సెక్కేసింది, పేపర్లో పడిన ఓ ఏడ్ ఏజెన్సీ అడ్రస్ పట్టుకుని !

అక్కడే ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న సుమన్‌తో కలసి పనిచేస్తోంది. సుమన్‌కి ఈలాంటి ఆడవాళ్ళని ఎలా ఉపయోగించుకోవాలో కెమోరాతో పెట్టిన విద్య. కలిసిన మర్నాడే మొదటి ట్రిక్ వదిలాడు - నాగలక్ష్మి



పేరు 'లక్ నగీనా' గా మార్చి, ' చూశావా పేరులోనే లక్ వచ్చేలాపెట్టాను. లక్ తిరిగినట్టే లెక్క, ఇక చూస్కో అన్నాడు.

తను తీయించుకున్న మొట్టమొదతటి ఫొటో ఆ చెట్టు దగ్గర తీయించుకున్నదే. ఫోటో చూస్కున్నాక 'మనసులో ఒక మూల నేనీ ఇండస్ట్రీకి పనికిరానేమో అని సందేహం కలిగినా సుమన్ మాట్లాడే మాటలు, చూపించే స్వర్గాలు దాన్ని నొక్కేసాయి.

ఒక్క ఏడాది తరువాత మరో సుబ్బలక్ష్మి కెరీర్ బాగుచెయ్యడం మొదలు పెడితేగాని తనెంత మోసపోయిందో నాగలక్ష్మికి తెలియలేదు. అప్పటికే చేతులు కాలిపోయాయి. ఇంక ఆకులు కోసం ఎందుకు వెతుక్కోవడం!

ఇంటికి వెళ్ళి మళ్ళీ మొహం చూపించలేక అందానికి మెరుగులు దిద్దే అన్ని కళలు నేర్చుకుని జూబ్లిహిల్స్‌లో 'నగీనా బొటిక్ ' పెట్టి ఆపనులతో పాటు తనలాగే మోసపోయే అవకాశం ఉన్న 'అప్‌కమింగ్ మోడల్స్‌కి, సుమన్ లాంటి వాళ్ళకి దూరంగా ఉండేందుకు, ఎలా తెలపాలనే విషయం మీద ఆలోచిస్తోంది.

❀❀❀